
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య-మాసపత్రికను మీరు క్రమముగా పొందదలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 20 — జూలై 1989 — సంచిక 12

## సంపాదకీయము

### ఆశ్చర్యకరమైన దేవుని వాక్యము

***(The Wonderful Word of God)***

పరిశుద్ధాత్మావేశము వలన గ్రంథకర్త యిట్లు వ్రాయున్నాడు. "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్ళను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4:12).

ఈ లేఖనభాగము, దేవుని వాక్యపు లక్షణములను వివరించుచున్నది. వాటిలో కొన్నిటిని గమనించెదము.

**I. దేవుని వాక్యము సజీవమైనది :—**

యేసుక్రీస్తు యిట్లు చెప్పెను, "ఆత్మయే జీవింపజేయుచున్నది; శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి" (యోహాను 6:63). దేవుని

వాక్యము ప్రాముఖ్యతను గూర్చిన నిదర్శనములను కొన్నిటిని గమనించుము.

1) దేవుని వాక్యమును నాశనము చేయుటకు యుగములతరబడి ప్రయత్నములు జరుగుచున్నను అది నేటికిని నిలచియున్నది. బలవంతులగు రోమా అధికారులు మొదలు నేటి అబద్ధ బోధకుల వరకు అనేకమంది సర్వదా ఈ గ్రంథ నాశనముకొరకు తీవ్రముగా ప్రయత్నించి అపజయమొందిరి. దేవుని వాక్యము సజీవమైనది కానిచో, అది నిలచియుండవలెనని ఆయన తలంచనిచో ఆ వాక్యము ఇప్పటికి చాలా పూర్వమే నాశనము చేయబడెడిది.

2) అన్ని యుగములందు గల జనులకు ఈ గ్రంథము వర్తించును. దేవుని పరిశుద్ధమైన నిత్యవాక్యము నేడు ఎట్లు సజీవమై సత్యమైయున్నదో అట్లే 1900 సం॥ల క్రితమును ఉండెను. మానవ గ్రంథములు సర్వదా ఉపయోగపడవని మనకు తెలియును. పాఠశాలలో గల గ్రంథములు ఎట్లు మార్పులు చేయబడుచున్నవో మన మెరుగుదుము. 25 సం॥ల క్రితముగల విజ్ఞాన శాస్త్ర గ్రంథములు నేడు మూలబడుచున్నవి. అట్లయిన 60 లేదా 100 సం॥ల క్రితమునాటి గ్రంథముల మాటేమి? అయితే బైబిలు గ్రంథము నేటికి రేపటి దిన పత్రికవలె నూతనముగా యున్నది. అంతేకాదు, ఈలోకము ఇంకొక 1900 సం॥లు నిలచియున్నచో ఎట్టి సవరణలు చేయబడకుండ దేవుని వాక్యము సరిపడి యుండును. ఒకవేళ క్రీ॥శ॥ 4000 సం॥ము జరుగుచున్నదని అనుకొనినచో ఆ గ్రంథము వ్రాయబడినపుడు ఎంత ఖచ్చితముగా వర్తించినదో నేడును అంతే ఖచ్చితముగా వర్తించునని మనము గ్రహించవలెను. అమెరికా ప్రజలకు వర్తించినట్లే ఆసియా ఖండమువారికి గూడ వర్తించును. ఆయా యుగములలోగల లేదా ఆయా ప్రాంతములవారికి ప్రత్యేకమైన గ్రంథములు అవసరములేదు.

3) దేవుని గ్రంథపు అభిరుచు లెన్నడును మారనివి. ఒక శతాబ్దము క్రితము బ్రిటన్ నందుగల యొక క్రైస్తవ మతాచార్యు డిట్లు వ్రాసెను : "మానవులు 18 శతాబ్దములనుండి ఆ ఒకే గ్రంథమును గూర్చి ఆలోచించి దానిని గూర్చియే వ్రాసిరి. మరి 18 శతాబ్దములకు అనేకమంది వ్రాయుటకు అనుమతింపబడినచో ఒక్కడును అందలి సంగతులను జరిగించుటకు ఆరంభింపడు." ప్రపంచమందలి మేధావులు తమ సమయమంతయు దైవగ్రంథము కొరకు కేటాయించినను అందలి నిగూఢ సంగతులను వెలికి తీయుట అసాధ్యము. వేరొక విధముగా చూస్తే అదియొక ఇరుకు మార్గమువంటిది. బాలుడు సహితము అందలి విషయములలోనికి చొచ్చుకొని పోవుచు అందుగల గొప్ప సత్యములను గ్రహింపగలడు.

అద్భుతమైన దేవుని వాక్యము జీవమనుగ్రహించెను. దైవ గ్రంథపు ఆజ్ఞలను నమ్మి వాటికి విధేయులగువారు క్షయబీజమునుండి గాక అక్షయబీజము వలన తిరిగి జన్మించిన వారగుదురు. దేవుని వాక్యము ఎల్లప్పుడు నిలుచును (1 పేతురు 1:23). పౌలుగూడ యిట్లు వ్రాసినాడు. "క్రీస్తునందు మీకు ఉపదేశకులు పది వేలమంది యున్నను తండ్రులు అనేకులు లేరు. క్రీస్తు యేసునందు సువార్త ద్వారా నేను మిమ్మును కంటిని" (1 కొరింథి 4:15, 16).

దేవుని వాక్యము దారి చూపును, నడుపును. దావీదు యిట్లు పలికెను, "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగై యున్నది" (కీర్తన 119:105). మార్గాంతము చేరునపుడు యేసుక్రీస్తుయొక్క మాటలచే మనము తీర్పు తీర్చబడుదుము (యోహాను 12:48-50). ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై యున్నది.

"నన్ను నిరాకరించి నా మాటలు అంగీకరింపని వానికి తీర్పు

తీర్చు వాడొకడుకలడు. నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును. ఏలయనగా నా అంతట నేనే మాటలాడలేదు; నేను ఏమనవలెనో యేమి మాటలాడవలెనో దానిని గూర్చి నన్ను పంపిన తండ్రియే నాకాజ్ఞ యిచ్చియున్నాడు. మరియు ఆయన ఆజ్ఞ నిత్యజీవమని నేనెరుగుదును. గనుక నేను చెప్పుసంగతులను తండ్రి నాతో చెప్పిన ప్రకారము చెప్పుచున్నాననెను".

కావున దేవుని వాక్యము మనలను నడుపును, తీర్పు తీర్చును. అది తండ్రి యొద్దనుండి వచ్చినది నిత్యమైనది. అట్టి వాక్యమును నేర్చుకొని, నమ్మి, విధేయుల మగుటచే నిత్యజీవమ్ము పొందుట. ఎంతటి ధన్యకరము! క్రీస్తు కంటె వేరె యెవని యొద్దకు వెళ్ళుదము, ఆయనే నిత్యజీవపు మాటలు గలవాడు (యోహాను 6 : 68).

## II దేవుని వాక్యము బలము గలది

మానవులను దేవుని పిల్లలుగా చేయుటలోనే దీని బలము యిమిడి యున్నది. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి గ్రీసు దేశస్తునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1 : 16).

దేవుని కిష్టమగు, ఆత్మలను రక్షించు విశ్వాసము వాక్యము వలననే జనించును. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును. వినుట దేవుని గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10 : 17).

మానవుల పాపములను ఒప్పింపజేయుశక్తి దేవుని వాక్యమునకు గలదు. దేవుడు యిర్మీయాతో యిట్లు చెప్పెను. "నా మాట బండను బద్దలు చేయు సుత్తెవంటిది కాదా" (యిర్మీ 23 : 29). మహా యోధుడగు తార్సువాడైన సౌలు దేవునివాక్యమునకు ఎదురు నిలువ

లేక పోయినాడు. పెంతెకోస్తు దినమున అనేకులు దేవుని వాక్య ప్రకటన వలన తాము పాపులమని గ్రహించిరి. పూర్వకాలమందు సువార్త ఎక్కడెక్కడ ప్రకటింపబడినదో అక్కడ పశ్చాత్తాపము ఉజ్జీవము కలిగెడిది. పూరి గుడిసెలలో నివసించువారు మొదలుకొని పాలరాతి భవనములలో నివసించు రాజులు చక్రవర్తులు కూడ దేవుని వాక్యప్రకటనవలన తాము పాపులమని ఒప్పుకొనిరి.

దేవుని వాక్యము పాపమును ఒప్పింపజేయుట మాత్రమే గాక పాపులను మార్చును. "యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యథార్థమైనది. అది ప్రాణమును తెప్పరిల్ల జేయును" (కీర్తన 19:7). బైబిలు సత్యములను సమన్వయపరచుచు యాకోబు యిట్లు వ్రాయుచున్నాడు. "అందుచేత సమస్త కల్మషమును, విఱ్ఱవీగుచున్న దుష్టత్వమును మాని, లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1 : 21).

దేవుని వాక్యము తప్పులను పొరబాట్లను సరిదిద్ద శక్తిగలది. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది" (II తిమో 3:16, 17). వాక్యము వలననే పాపము చేయువారిని తిమోతి బహిరంగముగ గద్దింప గలిగినాడు. ఫలితముగ పాపము చేయకుండునట్లు ఇతరులు దేవునికి భయపడిరి (1 తిమో 5 : 20).

దేవుని వాక్యము ఆదరణ నిచ్చును. యేసుక్రీస్తు రాకడను గూర్చి నిద్రించిన వారిని గూర్చి థెస్సలొనీక సహోదరులు కలవరపడుచుండగ పౌలు వారికి ఆదరణ కలుగురీతిలో వ్రాయుచున్నాడు.

"కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకని నొకడు ఆదరించుకొనుడి" (1 థెస్స 4 : 18).

దేవుని వాక్యము సహవాసమునకు పునాది. "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము మనలను ప్రతి పాపమునుండి పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1 : 7). వెలుగులో నడచుటమీద ఆధారపడి సహవాసముండును. వెలుగులో నడచుట యనునది ఆయన ఆజ్ఞలను గైకొనుటపై ఆధారపడియున్నది (1 యోహాను 2 : 3). ఈ బోధయందు నిలచి యుండనివాడు సహవాసమునకు అయోగ్యుడు గనుక అట్టివానితో మనము ఏకీభవింప రాదని ఆజ్ఞాపింపబడితిమి. "క్రీస్తు బోధయందు నిలచి యుండక దానిని విడచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచి యుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు. ఎవడైనను ఈ బోధను తేక మీ యొద్దకు వచ్చిన యెడల వానిని మీ యింట చేర్చుకొనవద్దు; శుభమని వానితో చెప్పనువద్దు. శుభమని వానితో చెప్పువాడు వాని దుష్టక్రియలలో పాలివాడగును" (2 యోహాను : 9-11).

## III దేవుని వాక్యము వాడియైనది

హెబ్రీ 4:12లో వ్రాయబడిన "ఖడ్గము" అను పదము అనేక మార్లు పదును గల వాడియైన ఖడ్గముతో పోల్చబడినది (ఎఫెసీ 6:17; ప్రకటన 1 : 16). పాపములో జీవించు మానవుడు భద్రముగా యున్నానని తలపోయుట వాని స్వభావమై యుండును. అయితే దేవుని వాక్యము అట్టి ఊహలను సహితము చీల్చివేయునంత వాడిగా

యున్నది. అది లోలోపలికి చొచ్చుకొని పోవును. రహస్యములు నిగూఢమైన విషయములు వాక్యమునకు తేటగా కన్పించును. సమస్త విధమైన వంచనతో కూడిన లేదా నరహంతకుల హృదయమును కూడ అది తాకును (అ.కా. 2:37).

## IV దేవుని వాక్యము శోధించుచున్నది

దేవుని వాక్యము విభజనలకు దారితీయు సిద్ధాంతములను, విమర్శలకు చోటిచ్చు వాటినిగూడ శోధించుచున్నది. దైవావేశ పరుడైన యాకోబు వ్రాసిన శక్తిగల వాక్యములను గమనింపుము.

"మీరు వినువారుమాత్రమై యుండి మిమ్మును మీరు మోస పుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి. ఎవడైనను వాక్యము వినువాడై యుండి దాని ప్రకారము ప్రవర్తిం పనివాడైతే, వాడు అద్దములో తన సహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. వాడు తన్ను చూచుకొని అవతలికి పోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా? అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరిచూచి నిలకడగా ఉండువా డెవడో వాడు విని మరచువాడు కాక, క్రియను చేయువాడై యుండి తన క్రియలో ధన్యుడగును" (యాకోబు 1:22-25). దేవుడు తన పరి శుద్ధ లేఖనములను దైవావేశముతో నింపి వ్రాసిన వలుబది మందిచే విభజించుట, విశ్లేషించుటద్వారా పాపులకు మార్గమును తెరచి యుంచెను. దేవుని దృష్టికి మరుగుగా నుండలేము. సర్వశక్తుడగు దేవుని యెదుట నిలచియున్నానని ఏమానవుడైనను గ్రహించినచో దేవుని గ్రంథము అతని హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించు చున్నదని అతడు నిశ్చయముగా తెలుసుకొనును.

## V దేవుని వాక్యము నిత్యమైనది

దేవుని వాక్యము నిత్యమైనదని మనము నేర్చుకొంటిమి. దేవుని వాక్యమే అంతము (2 తిమో 3:16, 17; 2 పేతురు 1:3; గలతి 1:6-9; ప్రకటన 22:18, 19). దేవుని వాక్యమునుండి యొక పొల్లయినను మార్పుచేయుటకు ఏ దేవదూతకు అధికారము లేదు. వాక్యమునకు ఏదియు కలుపరాదు తీసివేయరాదు. వాక్యము పరిపూర్ణమైనది అనంతమైనది. బలహీనమగు, క్షయమగు మానవులు మార్పుజెందని, సత్యమైన, పరిపూర్ణమైన వాక్యమును సవరించెదమని చెప్పుకొనుట వింతకాదా? వాక్యమును మార్చవలెనని యత్నించుట కోరి కష్టములు తెచ్చుకొనుట కాదా!

దేవుని వాక్యము. నిత్యము. యేసుయొక్క మాటలను గమనించుము: "ఆకాశమును భూమియును గతించునుగాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు" (మత్త 24 : 35), అపొస్తలుడైన పేతురు మాటలను గమనింపుము. "సర్వశరీరులు గడ్డిని పోలినవారు, వారి అందమంతయు గడ్డిపువ్వువలె ఉన్నది; గడ్డి ఎండును దాని పువ్వును రాలును, అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడును నిలుచును (1 పేతురు 1 : 24). మీకు ప్రకటింపబడిన సువార్త యీ వాక్యమే"

మనము వాక్యము వినవలెను (ప్రక 2 : 7). మనమేమి వినుచున్నామో జాగ్రత్తగా గమనింపవలెను (మార్కు 4 : 24). మనమెట్లు వినవలెనో నేర్చుకొనవలెను (లూకా 8 : 18). వాక్యమును పఠించవలెను (II తిమో 2 : 15). వాక్యమును ప్రకటింపవలెను (మార్కు 13:10). ఒక్కసారే అప్పగింపబడిన విశ్వాసము నిమిత్తము పోరాడవలెను (ఫిలిప్పీ 1 : 17; యూదా 3 వచ).

గతకాలమంతయు ప్రభువు యొక్క సంఘసభ్యులు ఈ గ్రంథమును బట్టియే గుర్తింపబడిరి, విస్తరించిరి. అట్టి గొప్ప కీర్తిని నేడు

మనము సంపాదించుకొనుచున్నామా! దేవుని వాక్యము ఆశ్చర్యకరమైనది, శక్తిగలది. వాక్యము నిజముగ ప్రశస్తమైనది. వాక్యముతో తమకుగల సంబంధమును బట్టి దాని యెడల గల వైఖరినిబట్టి అనేకులు అందరి దీవెనలను గూర్చి స్పష్టమైన అవగాహన లేక యున్నారు.

పట్టుదలతోను ఆసక్తితోను బైబిలును పఠించుటకు నిశ్చయించుకొందుముగాక; అట్లు చేయుట ద్వారా సహోదరులలో త్వరితముగా వ్యాపించుచున్న అసత్యపు బోధను నిరోధించుటకు సహాయపడగలము. ఆశ్చర్యకరమైన వాక్యము యొక్క లేదా ఈ గ్రంథము యొక్క ప్రజలుగా గుర్తింపబడుట ఎంతటి ధన్యకరము!

బి. విజయకుమార్,

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్.

---

## అన్నిటి కంటె భయపడవలసిన ఘడియ

## ("Of all Hours fear but one")

ఫ్రిన్స్ దేశమందలి క్లానీ నగరంలో సూర్యునిపై ఆధారపడి పనిచేసే ప్రాచీనమైన గడియారపు (Sundial) గోడపై జ్ఞాపకార్థమై ఈ మాటలు వ్రాయబడినవి. అన్నిటి కంటె భయపడవలసిన ఘడియ, నీ జీవితాన్ని నడిపించే అన్నిటి కంటే గొప్పదైన ఒక ఘడియ ఉన్నది. ప్రతివ్యక్తి తాను జీవించిన జీవితాన్ని ముగింపజేసి తన గమ్యాన్ని చేర్చే ఆఖరి సమయం ఒకటున్నది. "ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు" (అ.కా. 17:31). ప్రతి పనిని తలంపును గూర్చి వ్రాయబడిన నీ జీవితమును గూర్చిన

గ్రంథమొకటి దేవునిపద్ద యున్నది. "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును (2 కొరింథీ 5:10; ప్రక 20 : 11-15).

ఆఖరి తీర్పు దినమునకు మనం సిద్ధపడవలెనని బైబిలు విశదముగ తెలియజేయుచున్నది. 1. అది తప్పదు అది ఎవడును మార్పు చేయలేనిది. ఖచ్చితమైన దినమునై యున్నది. దానినుండి ఎవరునూ తప్పించుకొనలేరు. మార్పు చేయలేరు. తోసి పుచ్చలేరు. 2. అది సార్వత్రికమైనది. తీర్పు నిమిత్తమై మనుష్యులమారుని యొద్దకు జనములు పోగుచేయబడుదురు (మత్త 25 : 32). పాపులు, అవిశ్వాసులైన క్రైస్తవులు, క్రీస్తు వెలుపల ఉండి నైతిక జీవితమును జీవించినవారు, కొరాజీనా, బేత్సయిదా, యెరూషలేము, మాస్కో లేక వాషింగ్టన్ నగరాలుగాని ఎవరైనను ఆఖరి తీర్పుకొరకు అక్కడ ఉండవలెను (రోమా 14 : 10). 3. అది వ్యక్తిగతమైనది. గొప్ప తేజస్సు గలిగిన సింహాసనము ఎదుట నీవు ప్రత్యక్షము కావలసిన సమయం వచ్చినప్పుడు నీ జీవితాన్ని కనపరచునట్టి ఒక ప్రకాశమానమైన కాంతి నీ మీద ప్రసరింపబడుతుంది (1 కొరింథీ 3 : 13). అప్పుడు నీకు నీవే. క్రీస్తుకు విధేయుడ వగుటకు ఆయన రాజ్యమును మొదట వెదకుటకు నీవు విఫలుడవైన పక్షంలో ఆ నేరాన్ని సమాజంపై గాని, వేషధారులైన సంఘ సభ్యులపై గాని, వ్యతిరేకముగా నున్న పరిస్థితులపై గాని మోపడానికి నీకు అవకాశంలేదు. నీకు ఎటువంటి క్షమాపణలేదు. సృష్టి అంతయు చూచుచుండగా దేవుడు, నీవు మరియు నగ్నసత్యం అక్కడ ఉండును.

## గ్రంథాలు విప్పబడును

లేఖనము ఈలాగు బోధించుచున్నది. 1. రాబోవు తీర్పు

సంపూర్ణమైనట్టిదై యున్నది. "గూఢమైన ప్రతి అంశమును గూర్చి దేవుడు విమర్శ చేయునప్పుడు ఆయన ప్రతిక్రియను అది మంచిదేగాని చెడ్డదేగాని తీర్పులోనికి తెచ్చును" (ప్రసంగి 12 : 14). మన మెవనికి లెక్క యొప్ప చెప్పవలసి యున్నదో ఆయన కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా యున్నది (హెబ్రీ 4 : 13). పరలోకమందున్న దేవుని కంటికి కనబడకుండ దాగ గలవాడెవడైనను లేడు (యిర్మీ 23 : 23-24). ఆయన అంధకార మందలి రహస్యములను వెలుగు లోనికి తెచ్చి హృదయములలోని ఆలోచనలను బయలు పరచును (I కొరింథి 4 : 5). 2. పక్షపాతి కాని దేవుడు, దయగల రక్షకుని సమక్షంలో తీర్పు జరుగును. దేవుడు పక్షపాతి కాడు (అ॥ కా 10 : 34-35). నీ ధనము, సౌందర్యము, మేధస్సు, భూములు, కీర్తి, నిధులు మరియు మానవ సామర్థ్యము దేవుని దృష్టిలో వ్యర్థము. క్రీస్తు రుధిర తరంగంలో నీ పాపములు కడుగబడినవా? దేవుని చిత్తమున కనుగుణముగ నీ జీవితము జీవించితివా యనునవే ఇక్కడ ప్రధానాంశాలు! 3. సంపూర్ణమైన స్థాయిలో తీర్పు జరుగును. క్రీస్తు చనిపోయిన నాటినుండి మానవులందరికి ఆయన సువార్త ప్రకారము తీర్పు జరుగును (రోమా 2 : 16). నీకు పాతనిబంధన ప్రకారము తీర్పు తీర్చబడదు. మానవునిచేత వ్రాయబడిన విశ్వాస ప్రమాణ పుస్తకం ద్వారా గాని, చట్టం ద్వారాగాని, మానవ సమావేశాల ద్వారాగాని తీర్పు జరుగదు. ఇక్కడ మనం చదువుచున్నట్లు ఆ దినాన క్రొత్తనిబంధన గ్రంథం చదువబడును. మార్కు 16 : 15-16 అక్కడ ఉన్నది. యాకోబు 1 : 27 అక్కడ ఉన్నది. I కొరింథీ 16 : 1-2 అక్కడ ఉన్నది. రోమా 12 : 1-2 అక్కడ ఉన్నది. యేసు చెప్పెను; "నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహా 12 : 48) "ఓ తండ్రీ నీ చిత్తమును జరి

గించితినని" ఆ దినాన నీవు చెప్పాలంటే ఈ దినమునందే నీవు దేవుని చిత్తమునకు లోబడుట ఎంత వివేకము !

## ఆశ్చర్యాన్ని కలిగించే దినమది

తీర్పుదినము ఆశ్చర్యాన్ని కలిగించే దినమని యేసు సెలవిచ్చెను (మత్త 7:22-23). 1. ఆశ్చర్యం కలిగించే విషయమేమంటే ఆ దినాన క్షమాపణ లేదు. ఆనాడు మనం చెప్పే అవివేకమైన సాకులు దేవుని ఉగ్రతకు దారి తీస్తాయి. దీని విషయంలో రెండు మార్గాలు లేవు. విధేయుడవై నిత్యరక్షణ పొందుటగాని లేక అవిధేయుడవై నిత్య శిక్ష పొందుటగాని ఈ రెండింటిలోను ఏదో ఒకటే సాధ్యము. 2. మానవకల్పిత సంఘాలను దేవుడు అంగీకరింపడనునది ఆశ్చర్యకరమైన విషయం. మన ప్రభువు స్పష్టముగా చెప్పెను. "పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును" (మత్త 15:13). దేవుని వాక్యములో లేని సంఘాలలో వేలకొలది ప్రజలు తమ జీవితాలను గడుపుట ఎంత విషాదము! మత సంబంధముగ జీవించుట కాదు. దేవుని చిత్తమునకు విధేయుడవై యుండాలి. "నేను మిమ్మును ఎన్నడును ఎరుగను" అని ఆ దినాన ఆయన చెప్పును (మత్త 7:21-23). 3. యితరులు చేసిన కార్యాలను బట్టి, చేయని కార్యాలను బట్టి మనం తీర్పు తీర్చబడము. యిది మరొక ఆశ్యర్యకరమైన సంగతి. భార్య రక్షణ పొందితే భర్తకు, భర్త రక్షణ పొందితే భార్యకు ఇది వర్తించదు. తల్లిదండ్రులు పొందిన రక్షణను వారి పిల్లలు వారసత్వముగ పొందలేరు. ప్రతి వానికి తాను జరిగించిన క్రియలచొప్పున తీర్పు తీర్చబడును (రోమా 14:10-12). చాలామంది క్రైస్తవులు ప్రభువు పనిలో నమ్మకముగ పాల్గొనకుండ సంఘ సభ్యత్వమే రక్షించగలదని అభిప్రాయ పడుచున్నారు. నీవు దేవుని పనిలో విశ్వాసముతో పాలు

పొందనియెడల తీర్పుతీర్చు న్యాయాధిపతి యెదుట నీవు వ్యర్థునివుగా కనపడుదువు. 4. మన నీతి క్రియలను బట్టి దేవుడు మనకు తీర్పు తీర్చు ననునది ఆశ్చర్యము కలిగించేది. ఫెలిక్సువంటివారు వారికి సమయమైన నప్పుడు క్రైస్తవుడగుటకొరకు ఆలోచించుచున్నారు (అ.కా. 24:25). సువార్తకు విధేయుడగుటకొరకు, మంచి క్రైస్తవ జీవితము జీవించుట కొరకు మంచి సమయం కొరకు ఎదురుచూస్తూ వాటిని కార్య రూపంలో పెట్టకపోయిన యెడల తీర్పు సమయంలో అది నీకు పెద్ద ప్రమాదము కాగలదు (యాకోబు 2:14-26).

## మూడు తీర్పులు

ఆఖరిదినం చివరిలో మూడు తీర్పులు వెలువడును.

1. "నేను మిమ్మును ఎన్నడును ఎరుగను" (మత్త 7:21-23) అని క్రీస్తు సువార్తకు లోబడనివారితో చెప్పును.
2. "మిమ్మును ఎరుగను" (మత్త 25:12). ఒకసారి సిద్ధపడి ఆరిపోయిన దివిటీలు పట్టుకొనినవారి కివ్వబడిన తీర్పు.
3. "నీ యజమానుని సంతోషములో పాలు పొందుము" (మత్త 25:21) నమ్మకమైన మంచి దాసులు వినునట్టి ఆనందదాయకమైన మాటలు.

## నీవు సిద్ధముగ నున్నావా?

నా స్నేహితుడా, నీవు ఎలా ఉండాలని కోరుకుంటున్నావు? తీర్పులో దేవునిని కలిసికొనుటకు సిద్ధపడి ఉన్నావా? లేదా ఏదో దినాన సిద్ధపడాలని అనుకొనుచున్నావా? దేవునిని కలిసికొనుటకు ఇప్పుడే సిద్ధపడి ఉన్నావా? దేవుడు నిన్ను ప్రేమించి తన అద్వితీయ కుమారుడు నీ కొరకు చనిపోవునట్లు ఆయనను పంపెను (యోహా 3:16). ఆయనకు రక్షణ మార్గాన్ని ఇచ్చెను. విశ్వసించి, పాపముల విషయమై మారుమనస్సు పొంది (లూకా 13:3) క్రీస్తు ప్రభువని

ఒప్పుకొని (రోమా 10:10), బాప్తిస్మములో పాపక్షమాపణ కొరకు ఆయనతో కూడ పాతిపెట్టబడవలెను (అ.కా. 2:38; రోమా 6:3-4). విధేయుడవైతే దేవుడు నిన్ను సంఘముతో చేర్చును (అ.కా. 2:41). ఆయన పనిలో నమ్మకమైన జీవితాన్ని నీవు జీవించినట్లయితే గొప్ప సంతోషముతో తీర్పుదినాన ప్రభువును కలిసికొనగలవు.

సృష్టికర్తను కలసికొనుటకు జీవితంలో సిద్ధపడి ఉండుటయే నీయొక్క గొప్ప బాధ్యత. ఈ దినం దూరంగా లేదనునది ఆశ్చర్యం కలిగించే సత్యం. రహదారిపై నీ ప్రయాణంలో తరువాతి మలుపు వద్ద మరణాన్ని ఎదుర్కొన బోతున్నావు. "రాత్రి చాల గడచి పగలు సమీపముగా ఉన్నది" (రోమా 13:12). అక్కడ దేవునితో కలసి ఉంటావు. రాబోయే గొప్పదినానికి నిన్ను సిద్ధపరచడానికి క్రీస్తు సంఘాలు ఎదురు చూస్తున్నాయి.

—మేక్ లేటన్.

---

## గొఱ్ఱెపిల్ల జీవగ్రంథంలో నీ పేరున్నదా ?

జగదుత్పత్తి మొదలుకొని పరలోకంలో దేవుని గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథం ప్రారంభించబడెను (ప్రకటన 13 : 8). ఈ గ్రంథాన్ని మరియు గొఱ్ఱెపిల్లను గూర్చి తెల్సుకోవాలంటే దైవావేశము వలన కల్గిన బైబిలు గ్రంథాన్ని చదివినచో గ్రహించగలము. లోకంలో బైబిలు దేవుని గ్రంథం అని నిరూపించుకొనెను. ఈమాట నమ్మదగినదైనందున అట్టి దైవగ్రంథాన్ని చదువు వారు ధన్యులు (ప్రకటన 1 : 3).

### జీవగ్రంథంలో నీ పేరు వ్రాయబడాలంటే ?

క్రీస్తుప్రభు బలిచేయబడి భూమియందు విమోచన సంపాదించి పెట్టెను. అట్టి విమోచనను నీవు పొందాలంటే చీకటి నుండి సువార్త

పిలుపు ద్వారా (II థెస్స 2 : 4) బయటికి వచ్చి మారుమనస్సు పొంది (లూకా 13 : 3) పాపక్షమాపణ నిమిత్తము (అపొ.కా. 2 : 38) పునర్జన్మ సంబంధమైన స్నానం చేయాలి (తీతు 3 : 5). ఈ స్నానంలో శరీర మాలిన్యం తీసివేయబడదు ( I పేతురు 3 : 19-21) గాని బాప్తిస్మంలో గొఱ్ఱెపిల్ల యొక్క రక్తం ద్వారా నీ పాపములు కడిగివేయబడును (అపొ. కా. 22 : 16, ప్రకటన 7 : 13-14). అప్పుడు నీ పేరు జీవగ్రంథంలో వ్రాయబడును.

ప్రభువిట్లనెను, దయ్యములు లోబడుచున్నాయని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడనెను (లూకా 10 : 20). యువొదీను-సుంటుకేను, అను ఫిలిప్పీ స్థానిక సంఘ సోదరీల పేరులు జీవగ్రంథములో వ్రాయబడియున్నట్లు పౌలు చెప్పెను (ఫిలిప్పీ 4 : 2-3). పరలోకంలో దేవుడు ఒక గ్రంథాన్ని విప్పాడు. అందులో గొఱ్ఱెపిల్ల యొక్క రక్తముతో కొనబడినవారు ప్రతి వంశములో నుండియు ప్రతి ప్రజలు, ప్రతిజనులు, ఆయాభాషలు కలవారున్నట్లు యోహాను తెల్పెను (ప్రకటన 5:9-10). మరియు జ్యేష్ఠుల సంఘమును పరలోకమందున్నట్లు హెబ్రీ గ్రంథకర్త వ్రాసెను (హెబ్రీ 12 : 23). క్రీస్తు నందున్న వారు నూతన సృష్టి, అట్టి వారి పేర్లు జీవగ్రంథంలో వ్రాయబడును.

## దేవుని రాజ్యంలో లేక సంఘములో ప్రవేశం

మరియు రక్షణ పొందుచున్న వారిని ప్రభువు తన సంఘముతో చేర్చుచుండెను (అపొ. కా. 2 : 47). ఆయన మనలను అపవాది అధిపత్యం నుండి విడుదలచేసి తన కుమారుని యొక్క రాజ్య నివాసులుగా చేసెను (కొలస్స 1 : 13). మరియు పరలోక పౌరత్వాన్ని యిచ్చెను (ఫిలిప్పీ 3 : 20). గ్రంథంలో నీ పేరు శాశ్వతంగా ఉండాలంటే క్రీస్తు సంఘములో అపొస్తలుల బోధయందు స్థిరంగా

ఉండాలి. అప్పుడే నీవు తండ్రియందును క్రీస్తునందు నుండగలవు (II యోహాను 9-10). మరణం వరకు నీవును క్రీస్తులో నమ్మకముగా ఉన్నట్లయితే జీవ కిరీటం లభిస్తుంది (ప్రకటన 2 : 10).

## పేరుల కొరకు రికమెండేషన్ లేదు

ఇశ్రాయేలీయుల పక్షంగా మోషే కోరిన విధానం చూద్దాం. అయ్యో నీవు వారి పాపములను పరిహరించితివా లేనిచో నీవు వ్రాసిన నీగ్రంథంనుండి నా పేరు తుడిచి, వారి పేరులు వ్రాయమంటే దేవుడు అలా జరుగుటకు వీల్లేదు అనెను (నిర్గమ 32:32-33). మరియు రాజైన దావీదు కోరిన విధానం - జీవగ్రంథంలో నుండి వారి పేరులు తుడిచి పెట్టుము, నీతి మంతుల పట్టీలో వారి పేరులు వ్రాయకుమని కోరితే (కీర్తన 69 : 27-28) దేవుని దృష్టిలో రాజైననూ నాయకుడైననూ ఎవరైనా సరే ఈ సిఫారసు అసాధ్యమని నిరూపించబడెను.

## నీ జీవిత విధానం

గ్రంథంలో పేరులతో పాటు జీవిత విధానం కూడా వ్రాయబడ్తుంది. దేవుని యందలి భయభక్తులు కలవారు ఒకరితో నొకరు మాట్లాడు కొనుచుండగా యెహోవా చెవి యొగ్గి ఆలకించును. ఇలా భక్తి కల్గి ఆయన నామము స్మరించు వారికి జ్ఞాపకార్థంగా ఒక గ్రంధము ఆయన సముఖమందు వ్రాయబడెను (మలాకీ 3 : 16). నా సంచారములను లెక్కించి యున్నావు, నా కన్నీళ్లు నీ బుడ్డిలో నుంచబడియున్నవి, అవి నీ కవిలెలో (పుస్తకము) కనబడెనని దావీదు చెప్పెను (కీర్తన 56 : 8). సార్దీసు సంఘాన్ని గూర్చి ప్రభువు చెప్పినది నీ క్రియలను నే నెరుగుదును జీవిస్తున్నావన్న పేరు మాత్రము న్నదిగాని నీవు మృతుడవే (ప్రకటన 3 : 1-4). దేవా నీవు నన్ను పరిశోధించి తెలిసికొనియున్నావు, నేను లేచుట కూర్చుండుట నీకు తెలియును (కీర్తనలు 139 : 1-2). యూదా రాజు దేవా నా రికార్డు,

చూడు ఎట్లుండు ! నిన్ను హత్తుకొని వెంబడించాను, యదార్థ హృదయుడనై నీ సన్నిధిలో సత్యముతో గడిపాను. నీ దృష్టి కను కూలంగా సమస్తాన్ని ఎట్లు జరిగించితినో జ్ఞాపకం చేసుకొనుమని హిజ్కియ పలికెను (II రాజులు 20 : 1-3;18 : 5-7).

## తీర్పునందు గ్రంధములు విప్పబడుట

మరియు జీవ గ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను. ఆ గ్రంథములో వ్రాయబడిన వాటినిబట్టి మృతులు తమ క్రియల చొప్పున తీర్పుపొందిరి. ఎవని పేరైనను జీవ గ్రంథంలో వ్రాయబడి నట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడును, ఇది రెండవ మరణము (ప్రకటన 20 : 12-15). ఆ రోజు దేవుని యెదుట నేను ఫలానా సంఘ సభ్యుని ప్రభువా ! నీ నామాన దయ్యాలను వెళ్ళగొట్టాను, అద్భుతాలు చేసానంటే ? అక్రమము చేయు వార లారా మీరెవరో నాకు తెలియదు అని అంటాడు (మత్తయి 7:21-23). జీవగ్రంథంలో పేరులు వ్రాయబడినవారే - పరలోకంలో ప్రవే శింతురు (ప్రకటన 21 : 27). నీపేరు దేవుని గ్రంథంలో కనబడనిచో అగ్నిగుండమే గతి ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యపెట్టినచో ఏలాగు తప్పించుకొందువు? (హెబ్రీ 2 : 2-3).

— G. ప్రకాశం, పెరంబూరు, మద్రాసు-12

---

## మంచి పేరు మేలు

మొదటిగా ఒక ఊరికి పేరు పెట్టినవాడు కయీను. "... అప్పు డతడు ఒక ఊరు కట్టించి ఆ ఊరికి తన కుమారుని పేరునుబట్టి హనోకను పేరు పెట్టెను" (ఆది 4:17). ఆదాము సమస్త పశువులకును, ఆకాశ పక్షులకును, సమస్త భూజంతువులకును పేరు పెట్టెనని ఆది కాండము 2:20 వచనములో చదువగలము. ప్రతీదానికి ప్రతీహానికి ఒక పేరు అవసరం. అది ఒక పరమార్థం.

దేవుని కుమారునికి కూడా, ఒక పేరు అవసరమయ్యెను. ఆలోచించుడి. "ఆమె ఒక కుమారుని కనును. తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు 'యేసు' అని పేరు పెట్టుదువనెను" (మత్తయి 1:21). "ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును. ఆయనకు ఇమ్మానుయేలను పేరుపెట్టుదురు" (యెషయా 7:14). యేసు అను పేరుకు రక్షకుడని, ఇమ్మానుయేలను పేరుకు దేవుడు మనకు తోడని అర్థము. దేవుని కుమారునకు పెట్టబడిన పేరులోని భావము వర్ణనాతీతము. ఎంత ధన్యముగల నామము. పరమార్థ భావసంకల్పముతో వెలుగొంది విరాజిల్లుచున్న ఈ పేరువలన రక్షణ కలుగుచున్నది. మరి ఎవనివలనను రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలెను (అపో.కా. 4:12). యేసు నామము మనలను రక్షించుచున్నది.

ప్రతి పేరునకు ఒక అర్థము పరమార్థము ఉండును. దేవుని చిత్తప్రకారము జరిగించెడివారికి దేవుడు ఒక పేరు నిర్ణయించెను. "జెకర్యా భయపడకుము నీ ప్రార్థన వినబడినది. నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును. అతనికి యోహాను అను పేరుపెట్టుదువు" (లూకా 1:13). తన కీయబడిన నామమును బట్టి అతడు యెహోవా కృపను ప్రకటించెను.

## క్రొత్త పేరు

నేడు దేవుని చిత్తము జరిగించెడి వారికి మంచి పేరు ఈయబడుచున్నది. ఆ పేరును దేవుడు తన ప్రవక్తల ద్వారా ముందుగా ప్రకటించెను. "నీతియను మస్తకి వృక్షములనియు, యెహోవా నాటిన చెట్లనియు వాటికి పేరు పెట్టుదును" (యెషయా 61:3). క్రీ॥పూ॥ 700 సం॥ల క్రితం యెషయా అను ప్రవక్త ఇట్లు పలికెను: "పరిశుద్ధ జనములనియు, యెహోవా విమోచించిన వారనియు వారికి పేరు

పెట్టబడును" (యెష 62:12). "యెహోవా నియమింపబోవు క్రొత్త పేరు నీకు పెట్టబడును" (యెష 62:2). "కొట్టివేయబడని నిత్యమైన పేరు వారికి పెట్టుచున్నాను" (యెష 56:5). దేవుని ఆజ్ఞలకు లోబడి రక్షణ మార్గమునకు లోబడినవారికి ఈ పేరు పెట్టబడును. అది క్రైస్తవుడు ..."మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులన బడిరి" (అపొ. కా. 11:26). క్రైస్తవుడనగా క్రీస్తును ధరించుకొను వాడు. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించి కొనియున్నారు" (గలతి 3 : 27). ఎంత గొప్పనామము! అట్టి పేరును నీవు కలిగియుంటివా ? దానిని కాపాడుకొనుము.

## సరియైన పేరు

సంఘమునకు క్రీస్తు నామము సరియైనది వాక్యప్రకారమైనది. ఎందుకనగా ఆయన సంఘమును కట్టుదునని వాగ్దానం చేసెను. (మత్తై 16 : 18). ఆయన దానిని తన రక్తముచే సంపాదించెను (అపొ. కా. 20 : 28). దానిని పరిశుద్ధ పరచుటకై దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫెస్సి 5 : 27). ఆయనే సంఘము నకు శిరస్సు (కొలస్స 1 : 18). అది క్రీస్తు సంఘము అని పిలువబడెను (రోమా 16 : 16). కాని నేటిలోకములో అబద్ధ బోధకులు వాక్య మును భిన్నముగా బోధించుచున్నారు. సంఘమునకు తమ స్వంత పేర్లను లేక మనుష్యుల యోచనలనుబట్టి పేర్లను పెట్టుచున్నారు. లూథరన్స వారమని, పెంతెకోస్తు వారమని, బాప్టిస్టు వారమని భక్త సింగ్ వారమని చెప్పుకొనుచున్నారు. పైన చెప్పిన పేర్లు బైబిలు నందు ఉన్నవా ? ఆ పేర్లు పరిశుద్ధాత్మ చేత ముద్రింపబడినవా ? అని ఆలోచించువారు కరువైరి.

మిత్రుడా ఇది గమనించి ధ్యానించుము. ధ్యానమనగా సోమరి వాని పగటి కలలు కాదు. క్రమశిక్షితమైన తలంపులకే ధ్యానమని

పేరు. "సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుము" (1 థెస్స 5 : 21). మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును" (యాకోబు 4 : 17). ఏ నామమైనను ఫరవా లేదులే నంటివా ? ఏ సంఘమైనను ఫరవాలేదులే అని అనుకొంటివా తీర్పులో ప్రమాదమున్నదని మరువకుము. "నా తండ్రి నాటని ప్రతిమొక్కయు పెల్లగింపబడును" (మత్త 15 : 13). యేసు అను మంచి పేరు నీకు మేలు కలుగజేయును. క్రీస్తు సంఘమునందు నీకు నిత్యజీవము దొరకును.

"ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడును" (ప్రక 20 : 15). నీవు పరలోకం చేరుటకు, జీవగ్రంథములో నీ పేరు వ్రాయబడుటకు క్రీస్తు నామము ధరించి క్రీస్తు సంఘములోనికి రమ్ము, మరణమువరకు నమ్మకంగా ఉండుము. దేవుడు నిన్ను దీవించునుగాక !

— డి. అబ్రహాం, నడిపూడి.

---

## క్రైస్తవుడు
## ( Christian )

"క్రైస్తవుడు" అనే పదం బైబిలునందు మూడుసార్లు వ్రాయబడింది (అపొ.కా. 11 : 26, 26:28; 1 పేతురు 4 : 16). క్రైస్తవుడు అంటె క్రీస్తు వంటివాడని అర్థము. క్రైస్తవ్యము వంశపారంపర్యముగా లభించే స్వాస్థ్యము కాదు. తల్లితండ్రులు క్రైస్తవులైతే కుమారులు వారసత్వమునుబట్టి క్రైస్తవులు కానేరరు, వారికి యుక్త వయస్సు వచ్చిన తరువాత క్రీస్తును హృదయమందు విశ్వసించి ఆయన ఆజ్ఞలకు విధేయులైతేనే వారు క్రైస్తవులగుదురు. ఒకసారి చర్చికి వెళ్ళినంత మాత్రాన, ఒక బోధకుడు ఆ గృహాన్ని దర్శించినంత మాత్రాన ఈ ఆధ్యాత్మిక ఆశీర్వాదాలు పొందేవికావు. "తనకు

విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను" హెబ్రీ 5 : 10. భార్య పొందిన ఆత్మ రక్షణ ఆమెను బట్టి భర్తకు వర్తించదు. వ్యక్తిగతముగా ఎవరికి వారే క్రైస్తవులు కావలసియున్నది.

ఎవరు క్రైస్తవులు? అనే ప్రశ్నకు బైబిలే సమాధానం. ఎవరో ఊహించిన విధంగా ఒకడు "క్రైస్తవుడు" అనే నామాన్ని ధరించలేడు. క్రైస్తవులుగా మారే హక్కు ఎవరికి ఉంది? అని ప్రశ్నిస్తే అందరికీ ఉన్నదనేదే జవాబు. దేశం, కులం, స్త్రీ, పురుషుడు అనే భేదాలు లేవు. కాని విధేయత అత్యవసరం.

క్రైస్తవ్యం రోమా రాజులు కాలంనుండి హింసలకు గురి యగుచునేయున్నది. ఈ మార్గమందు నిలిచి యున్నవారు పొందిన శ్రమలు మరెవరూ పొందలేదనేది నిర్వివాదాంశం. ఈ మార్గంకొరకు ఆత్మత్యాగం చేసినంత మంది మరెక్కడ త్యాగం చేయలేదనునది చరిత్ర చెప్పిన సత్యం.

ఎవడైనను క్రైస్తవుడు కాగోరిన యెడల అతడు క్రీస్తునందు విశ్వసించవలెను, మారుమనస్సు పొందవలెను. క్రీస్తుప్రభువని నోటితో ఒప్పుకొనవలెను. బాప్తిస్మము పొందవలెను. (హెబ్రీ 11 : 6, లూకా 13 : 3, రోమా 10 : 9, అ. కా. 2 : 38).

విశ్వసించలేనివారు, మారుమనస్సు అంటే ఏమిటో తెలియని పిల్లలు బాప్తిస్మము పొందనక్కరలేదు. వారికి ఏ షరతులేకుండ పరలోకరాజ్యము వాగ్దానము చేయబడింది.

"యేసు - చిన్నపిల్లలను ఆటంకపరచక వారిని నా యొద్దకు రానియ్యుడి పరలోకరాజ్యము ఈలాటి వారిదని వారితో చెప్పి వారిమీద చేతులుంచి అక్కడనుండి లేచిపోయెను" (మత్త 19:14). చిన్నపిల్లలు క్రైస్తవులు కాదని బైబిలు విశదీకరించుచున్నది.

నమ్మి బాప్తిస్మము పొందినవారే క్రైస్తవులు. ఎన్ని సంవత్సరాలు చర్చికి అనగా సంఘానికి వచ్చినా ఎన్ని గొప్ప కార్యాలు, దానాలు చేసినా పై ఆజ్ఞలకు విధేయత చూపనియెడల వారు క్రైస్తవులు కాదు.

ఒక అధికారి సంఘమునకు అతిధిగా వస్తే అతడూ క్రైస్తవుడేనా? కావే కాదు. చర్చికి వెళ్లేవారందరూ క్రైస్తవులు కాదు.

దురదృష్టవశాత్తూ సమాజం దృష్టిలో క్రైస్తవుడు చాలా తక్కువవాడై యున్నాడు. క్రైస్తవాన్ని స్వీకరించినవానికి కొన్ని వసతులు లేకపోవచ్చును. కొన్ని ఆటంకాలు రావచ్చును. లోప భూయిష్టమైన ప్రకృతి సంబంధమైన వసతులకంటే మనకు తండ్రి యింట ముందుగా సిద్ధపరచబడిన నివాసాల్లో హాయిగా జీవించుట భాగ్యం కాదా? (యోహా 14:2).

క్రైస్తవులు ఏర్పరచబడిన వంశము, రాజులైన యాజక సమూహము, పరిశుద్ధ జనము, దేవుని సొత్తయిన ప్రజలు (1 పేతు 2:9). "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీ రెరుగరా? మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడినవారు. గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి" (1 కొరింథీ 6:19-20). క్రైస్తవులు పరిశుద్ధులుగా నుండుటకు పిలువబడినవారు. ఈ పరిశుద్ధులు వారిష్టానుసారంగా మాట్లాడుటకుగాని ప్రవర్తించుటకుగాని వారికి అధికారము లేదు. వీరు తమ శత్రువులను సహితము ప్రేమించాలని హెచ్చరింపబడినవారు. వీరు తమ అధికారులకు లోబడియుండాలి. వీరు నిందించబడినను శపింపబడినను తిరిగి శపించడానికి అధికారము లేదు. శ్రమలను మేలుగాను నింద గొప్ప భాగ్యంగాను ఎంచుకోవాలి. హింస పొందుటయే గాని హింసించుట మీ చేతకానిపని యనుటకు చరిత్రయే తార్కాణముగా నున్నది.

ఒక పాటలో ఈలాగు వ్రాయబడింది.

"శ్రమలే వీరి సైన్యము, సహనమే వీరి ధైర్యము
త్యాగమే వీరి క్షేమము, ప్రార్థనే వీరి జీవితము
వాక్యమే వీరి బాణము, విశ్వాసమే వీరి ఉద్యమము
సమర్పణే వీరి శీలము, యేసే వీరి కార్యక్రమం
ప్రేమే వీరి పరాక్రమము"

ఈ పరిశుద్ధులపై ఎందుకీ వివక్ష? క్రీస్తుకోసం మరణించడానికైనా సిద్ధపడినవాడే నిజమైన క్రైస్తవుడు.

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు - 533 222.

---

## పరిశుద్ధ గ్రంథములో స్త్రీ యొక్క స్థానము

దేవుడు స్త్రీని చేసినపుడు ఆయన నరుని ప్రక్కటెముకలలో ఒకదానినుండి స్త్రీని నిర్మించెను (ఆది కా. 2:21-23). నరునిలోనుండి తీయబడెను గనుక ఆమె నారి అనబడినది. అయితే ఈ స్త్రీయొక్క అవిధేయత,దురాశలనుబట్టి లోకములో పాపము ప్రవేశించెను. దేవుడు తినవద్దని ఆజ్ఞాపించిన పండును తినుటద్వారా స్త్రీ దేవునికి అవిధేయత చూపించింది. పాపమునకు కారకురాలయింది. లూకా 1:26-33 లో యుండిన వాక్యభాగమును బట్టి స్త్రీనుండి కలిగిన శిశు ప్రసూతి ద్వారా లోకరక్షకుడు అవతరించెను, మత్తయి 1:21 లో తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను. లోకరక్షకుడైన యేసు స్త్రీ గర్భమునుండి జన్మించెను.

### ప్రభువు రక్షణలో స్త్రీ :-

ఆయన సేవాపరిచర్యలో ఆయనను వెంబడించినవారిలో యెక్కువగ స్త్రీలుకూడ యున్నారు. ఆయనచే స్వస్థతపొందిన వారిలో

కూడ స్త్రీలున్నారు. కొన్ని నిదర్శనాలు : (1) 12 సం॥ల నుండి రక్తస్రావ రోగముచే బాధపడుచున్న స్త్రీని, ప్రభావము ఆయనలో నుండి బయలువెళ్ళి ఆమెను స్వస్థపరచింది. (2) 18 సం॥ల నుండి బలహీనపరచు దయ్యము పట్టిన స్త్రీ (లూకా 13:10-13). (3) పేతురు అత్తను కఠిన జ్వరమునుండి స్వస్థపరచుట మున్నగునవి.

ఆయనను యెక్కువగ ప్రేమించినవారిలో కూడ స్త్రీలున్నారు:- మరియు తన కన్నీటితో ఆయన పాదములు కడిగింది. తన తల వెంట్రుకలతో ఆ పాదములు తుడిచింది. ఆయన పాదములు ముద్దు పెట్టుకొని అత్తరు పూసింది (లూకా 7:36-38, 44-48; మత్తయి 26:6-13).

స్త్రీలను ఆయన ప్రేమించి, క్షమించి రక్షించిన విధము : యోహాను 8 : 3-11లో వ్యభిచారమందు పట్టబడిన స్త్రీని ఆయన అమ్మా ! అని సంబోధించుటలో ఆయన ప్రేమను గ్రహించగలము. "నేనును నీకు శిక్ష విధింపను. నీవు వెళ్ళి యికను పాపము చేయకుము" అని చెప్పెను. ఎంత గొప్ప క్షమాపణ. యోహాను 4:5-30,39. సమరయ స్త్రీని రక్షించిన విధము ఈ భాగములో మనము చూడగలము.

యేసును సిలువ వేయుటకు తీసికొనిపోవుచున్నపుడు అనేక మంది స్త్రీలు ఆయనను వెంబడించారు (లూకా 23:27-30). ఆ సమయములో అనేక మంది భయముతో ఆయనను విడిచి పారిపోయారు. కాని స్త్రీలైతే ధైర్యముతో ఆయనను వెంబడించారు (లూకా 23:40). అప్పుడు గలిలయనుండి ఆయనతో కూడ వచ్చిన స్త్రీలు వెంటవెళ్ళి ఆ సమాధిని, ఆయన దేహము ఏలాగుంచబడెనో చూచి తిరిగి వెళ్ళి, సుగంధ ద్రవ్యములను, పరిమళ తైలమును సిద్ధపరచిరి (లూకా 23:55-56). ఆయనను వెంబడించుటలో స్త్రీలు ఎంతగా ధైర్యం, ప్రేమచూపిరో తెలియుచున్నది.

సిలువ వర్తమానము అనగా ప్రభువు మరణమును, సమాధిని జయించి లేచిన పునరుత్థాన వర్తమానమన్న మాట. ఇది స్త్రీ ద్వారానే ముందుగా లోకమునకు తెలియపరచబడింది (లూకా 24:1-12; యోహాను 20:11-18). ఇది స్త్రీలకు గొప్ప ధన్యత కదా!

బాల్యములో తల్లిదండ్రుల పోషణ, కాపుదల, యౌవనములో భర్త ప్రేమాదరణలు, వృద్ధాప్యములో బిడ్డల ఆదరణ స్త్రీకి అవసరము. యోహాను 19:26-27లో "అమ్మా! ఇదిగో నీ కుమారుడు. ఇదిగో నీ తల్లి" అని ఆయన చెప్పెను. అప్పటినుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను. యేసు బాధ్యతగలిగిన కుమారుడని చెప్పుటకు సందేహము లేదు.

## స్త్రీయొక్క సౌందర్యము

మన దేహములు దేవునికి ఆలయములని తెలియునుగదా. దేవుని ఆలయములైన మన దేహములను పరిశుభ్రముగ, ఆరోగ్యముగా, సౌందర్యముగ దేవునికొరకు కాపాడుకోవాలి.

స్త్రీలు అణకువయు, స్వస్థబుద్ధియు గలవారై యుండి, దైవభక్తి గలవారమని చెప్పుకొను స్త్రీలకు తగినట్లుగ సత్క్రియలచేత తమ్మును తాము అలంకరించుకొనవలెను. ఇదియే స్త్రీ యొక్క సౌందర్యము. హృదయశుద్ధి గలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు (మత్త 5:8).

ఆమె కుమారులు లేచి ఆమెను ధన్యురాలందురు. సామెతలు 31:28. యెహోవాయందు భయభక్తులుగల స్త్రీ కొనియాడబడును. సామెతలు 31 : 30. స్త్రీలకు దేవుడెన్నియో గొప్ప ఆధిఖ్యతలను ఇచ్చినపుడు వాటిని వారు సద్వినియోగము చేసికొని రక్షణసువార్తను చాటుటలో ముందుకు సాగిపోవుటకు ప్రయత్నించాలి.

— జెస్సీ సలోమి జేసన్, కాకినాడ.

# కుష్ఠరోగి చెప్పే పాఠాలు

## 2 రాజు 5 : 1-15

1. మంచివారికి ఒక్కొక్కసారి చెడ్డ సంగతులు జరుగుతాయి, (2 రాజులు 5 : 1).
2. ప్రతి సమస్యకు, దేవుని దగ్గర పరిష్కారమున్నది (5 : 2-3).
3. పరిష్కారానికి కాని చోటుకు వెళ్ళరాదు (5 : 4-7).
4. సరియైన స్థానానికే వెళ్లితే మంచిది (5 : 8-10).
5. దేవునిమీద కోపపడకు (5 : 11-12).
6. దేవుని సంకల్పమే సిద్ధిస్తాది (5 : 13, 14).

స్వేచ్ఛానుసారంగా జీవించేవాడు జయం పొందలేడు. పార్శ్వ విధేయత పనికిరాదు. యేసుప్రభువును గూర్చిన జ్ఞానముకలిగి ఆయన చిత్తానికి లోబడుటద్వారా శ్రేష్ఠమైన జీవితవిధానం సాధ్యమగును (2 పేతురు 2 : 18-20; రోమా 5 : 21).

★

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYAWAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To
..........................................
..........................................
..........................................
..........................................